రేవంత్‌రెడ్డి మనీలాండరింగ్

- టికెట్ల పేరుతో కోట్లకు కోట్లు దోపిడీ
- కోట్లు కుమ్మరిస్తేనే కాంగ్రెస్ టికెట్లు
- సర్వే పేరుతో టిక్కెట్ల అమ్మకాలు
- డబ్బుకు బదులు పొలాలు, ప్లాట్లు
- 'ఖాన్ మార్కెట్'లో హవాలా దందా
- ముడుపుల్లో ఏఐసీసీ పెద్దలకు వాటా
- రాహుల్‌గాంధీ, ఖర్గే, ఠాక్రేకు చెప్పినా పట్టించుకోవడం లేదు
- కాంగ్రెస్ రెబల్స్ విజయ్‌కుమార్, ఖలీముద్దీన్ సంచలన వ్యాఖ్యలు

ఈడీకి ఇచ్చిన ఫిర్యాదు ప్రతిని చూపుతున్న విజయ్‌కుమార్, ఖలీముద్దీన్

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్‌లో టికెట్ల అమ్మకాల లొల్లి రోజురోజుకూ ముదురుతున్నది. ఇప్పటికే ధర్నాలు, అగ్రనేతలను అడ్డుకోవటాలు, పార్టీ ప్రధాన కార్యాలయం గాంధీభవన్ ముట్టడింపులు జరగ్గా.. తాజాగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై సొంతపార్టీ నేతలే ఏకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కే ఫిర్యాదు చేశారు. రేవంత్‌రెడ్డి టికెట్ల పేరుతో కోట్లలో హవాలా దందా నిర్వహిస్తున్నారని పీసీసీ మాజీ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర కాంగ్రెస్ ఎన్నికల ప్రచార కమిటీ మాజీ సభ్యుడు కురువ విజయ్‌కుమార్, ఆ పార్టీ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు ఖలీముద్దీన్ తీవ్ర ఆరోపణలు చేశారు. టికెట్లు ఆశిస్తున్నవారి నుంచి కోట్లకొద్దీ డబ్బు వసూలు చేస్తున్నారని, లేదంటే భూములు, ప్లాట్లు రాయించుకొంటున్నారని ఆరోపించారు. ఈ దందాలో కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి కూడా పాత్ర ఉన్నదని తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్యాలయంలో వారు గురువారం ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి టికెట్ల దందాపై సంచలన ఆరోపణలు చేశారు.

వందల కోట్లు తిన్న రాబందు రేవంత్‌రెడ్డి

'తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి పట్టిన చీడపురుగు రేవంత్‌రెడ్డి.. తనకు నచ్చినవారికి, కోట్ల రూపాయలు ఇచ్చినవారికి అడ్డగోలుగా టిక్కెట్లు అమ్ముకుంటున్నాడు. కోట్లు కుమ్మరిస్తేనే కాంగ్రెస్ టిక్కెట్లు వచ్చే రోజులు దాపురించినయ్. ప్రస్తుతం కాంగ్రెస్ నుంచి టికెట్లు వచ్చిన ఎంతోమంది దగ్గర డబ్బులు వసూలు చేసిండు. డబ్బు లేనోళ్ల దగ్గర ఎన్నో ఎకరాల భూములు బాండ్ పేపర్‌పై రాయించుకున్నాడు. అవి కూడా కుదరని వారితో ఫ్లాట్లు రాయించుకొని.. వందల కోట్ల మనీ లాండరింగ్‌కు పాల్పడుతున్నాడు. డబ్బునంతా హవాలా మార్గంలో హైదరాబాద్ నుంచి ఢిల్లీకి తరలించి ఏఐసీసీ పెద్దలకు పంచుతున్నాడు' అని విజయ్‌కుమార్, ఖలీముద్దీన్ ఆరోపించారు. వందల కోట్లు తిన్న రాబందు రేవంత్‌రెడ్డి అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

హవాలా దొంగగా అవతరించాడు

రేవంత్‌రెడ్డి అతిపెద్ద హవాలా దొంగగా అవతరించాడని విజయ్‌కుమార్ ధ్వజమెత్తారు. 'హైదరాబాద్ నుంచి ఢిల్లీకి హవాలా మార్గంలో డబ్బు పంపించి.. అక్కడ ఖాన్ మార్కెట్‌లో తన సమీప బంధువుతో దుకాణం ఏర్పాటు చేయించి.. ఆ డబ్బును ఏఐసీసీ పెద్దలకు కూడా పంచుతున్నాడు. అందుకే మేము ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్, ఠాక్రే వంటి సీనియర్ నేతలకు మెయిల్ చేసినా, లేఖలు రాసినా, ఫోన్లు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. రేవంత్‌రెడ్డి, ఠాక్రే, కేసీ వేణుగోపాల్ వంటివారంతా కుమ్మక్కై రాహుల్‌గాంధీని పక్కదారి పట్టించారు. తప్పుడు నివేదికలు ఇచ్చి డబ్బులిచ్చినవారి పేర్లతో లిస్టును ప్రకటించారు. రెండు నెలల క్రితం కాంగ్రెస్‌లో చేరిన 15 మందికి టిక్కెట్లు ఇచ్చారు. దీని వెనుక పెద్ద ఎత్తున మనీ ల్యాండరింగ్ జరిగింది. తెలంగాణలోనే పర్యటిస్తున్న రాహుల్‌గాంధీ ఈ విషయాలపై దృష్టిపెట్టాలి. కోవర్టు రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకొనేందుకు టిక్కెట్లు రానివారితో, కొత్తవారితో, సీనియర్లతో కలిపి ఒక కమిటీ వేసి, నిష్పక్షపాతంగా విచారణ చేయించాలి' అని డిమాండ్ చేశారు.

ప్లాన్ ప్రకారం కాంగ్రెస్ హత్య

రేవంత్‌రెడ్డి ప్రణాళికాబద్ధంగా, కుట్రపూరితంగా తెలంగాణ కాంగ్రెస్‌ను చంపుతున్నారని విజయ్‌కుమార్ మండిపడ్డారు. 45 ఏండ్ల పాటు పొన్నాల లక్ష్మయ్య పార్టీ జెండాను మోస్తే.. ఆయనను ఎన్నో రకాలుగా అవమానించారని ఆవేదన చెందారు. పొన్నాల పార్టీ మారితే.. చనిపోయే దశలో పార్టీ మారడం అవసరమా? అని రేవంత్‌రెడ్డి తన అహంకారం చూపించారని మండిపడ్డారు. పొన్నాలకు ఒక న్యాయం.. కొడంగల్‌లోని గురునాథ్‌రెడ్డికి ఒక న్యాయమా? అని ప్రశ్నించారు. పార్టీ కోసం ప్రాణాలు పణంగా పెట్టిన సీనియర్లు చిన్నారెడ్డి, మధుయాష్కి, పొన్నాల, ప్రభాకర్ వంటి నేతలు నేడు టిక్కెట్ల జాబితాలో లేరని అన్నారు. వాళ్లు కంటతడిపెడుతూ.. కాళ్లు మొక్కితేనేకాని టిక్కెట్లు ఇవ్వడం లేదంటూ దుయ్యబట్టారు. మధుయాష్కీ ఎంపీగా గెలిచినప్పుడు.. రేవంత్‌రెడ్డి జడ్పీటీసీగా కూడా లేడని, అలాంటి పెద్ద నేతలతో నేడు కన్నీళ్లు పెట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్ వంటి చీడపురుగును ఏరివేయకపోతే కాంగ్రెస్‌కు మనుగడ ఉండదని అన్నారు. ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌కు విరుద్ధంగా కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థుల లిస్టు విడుదలైందని విజయ్‌కుమార్, ఖలీముద్దీన్ ఆరోపించారు. రేవంత్‌ను ప్రశ్నిస్తున్నందుకు తమను పార్టీ నుంచి అక్రమంగా, అన్యాయంగా సస్పెండ్ చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. 'సునీల్ కనుగోలు పేరు చెప్పి బోగస్ సర్వేలు చేయిస్తున్నారు. ముందే ఒప్పందం కుదుర్చుకొని, డబ్బులిచ్చినవారికే సర్వేలు అనుకూలంగా చేయిస్తున్నారు. బలహీన వర్గాలకు వ్యతిరేకంగా తప్పుడు నివేదికలు ఇప్పించారు. రేవంత్‌రెడ్డి బలహీన వర్గాల నాయకత్వాన్ని చంపే కుట్ర చేస్తున్నాడు' అని మండిపడ్డారు. 'రేవంత్‌రెడ్డి సీఎం' అంటే తప్ప.. పక్కన తిరగనిచ్చే పరిస్థితి లేదని తెలిపారు.

రేవంత్ ఎక్కడికెళ్లినా టిక్కెట్ల దందానే

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ స్థానం పరిధిలో ఐదు ఎమ్మెల్యే టిక్కెట్లు కొత్తవారికే ఇచ్చారని విజయ్‌కుమార్ విమర్శించారు. 'కల్వకుర్తిలో కసిరెడ్డి నారాయణరెడ్డి కొన్ని కోట్లకు టిక్కెట్లు కొన్నట్టు ఆరోపణలొస్తున్నయ్. నాగర్‌కర్నూల్‌లో రాజేశ్‌రెడ్డి రాజ్‌పుష్పలోని ఫ్లాట్లు, విల్లాలు రాసిచ్చినట్టు చెప్తున్నారు. కొల్లాపూర్‌లో జూపల్లి కృష్ణారావు రూ.30 కోట్లు ఇచ్చినట్టు తెలిసింది. వనపర్తిలో మేగా రెడ్డి రూ.25 కోట్లు, గద్వాలలో సరిత రూ.10 కోట్లతోపాటు, ఐదు ఎకరాల భూమి ఇచ్చినట్లు సమాచారం. ఇంకో నేత మరో రూ.60 కోట్లు ఇచ్చినట్టు మావద్ద ఆధారాలున్నాయి. ఓడిపోయే చోట్లలో బీసీ, మైనార్టీ వర్గాలకు టిక్కెట్లు ఇస్తామని అంటున్నారు. ఇలా పార్టీ టిక్కెట్లు అమ్ముకుంటే.. రేవంత్‌రెడ్డి తన జీవితంలో సీఎం కాలేడు. అవినీతి మరకలంటిన పీసీసీ చీఫ్ సంతకం పెట్టిన బీఫామ్‌ను నేను తీసుకోను. ఒకవేళ కాంగ్రెస్ గెలిచినా సీఎం కాలేనని రేవంత్‌కు కూడా తెలుసు. అందుకే 2028ని టార్గెట్‌గా పెట్టుకున్నాడు. అసంతృప్త నేతలకు తన అనుచరులతో ఫోన్లు చేయించి బెదిరిస్తున్నారు. తల తెగిపడినా రేవంత్‌రెడ్డికి భయపడేది లేదు' అని స్పష్టం చేశారు.

రేవంత్ హవాలాపై ఈడీకి ఫిర్యాదు

రేవంత్‌రెడ్డి హవాలా దందా నిగ్గు తేల్చాలని ఈడీకి ఫిర్యాదు చేసినట్టు విజయ్‌కుమార్ తెలిపారు. 'ఎవరెవరికి టిక్కెట్లు వచ్చినయ్? ఎవరెవరి కుటుంబసభ్యులు, కంపెనీలు, సొంత బ్యాంకు అకౌంట్ల నుంచి డబ్బులు రేవంత్‌కు వచ్చినయ్? అనేది తేల్చాలి. రేవంత్‌రెడ్డితో సహా ఆయన చుట్టూ ఉన్న కోటరీ అకౌంట్ల లెక్కలు తీయాలి. గత ఆరు నెలలుగా ఎవరెవరి పేరు మీద భూములు రిజిస్ట్రేషన్ అయినయ్? రేవంత్ షాడోలు ఎవరు? అనే విషయాలన్నీ నిగ్గు తేల్చాలి. అలాగే హైదరాబాద్ నుంచి ఢిల్లీకి నగదు హవాలా రూపంలో ఎలా పోతున్నది? ఢిల్లీ ఖాన్ మార్కెట్‌లోని రేవంత్ కుటుంబసభ్యులు, వారి దుకాణాలు, తరలిపోతున్న వందల కోట్ల రూపాయలపై తక్షణమే విచారణ చేపట్టాలని 28 పేజీలతో ఈడీకి విజ్ఞప్తి చేశాం. మా ఫిర్యాదును స్వీకరించినట్టు ఈడీ అధికారులు ధృవపత్రం ఇచ్చారు. అలాగే కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీలోని పరిణామాలపై ఫిర్యాదు చేశాం' అని వివరించారు.

దొంగ సర్వేలతో దందా

> చంద్రబాబు, నారా లోకేశ్‌ల బంధువు అయిన సునీల్ కనుగోలుతో దొంగ సర్వేలు చేయిస్తూ.. చంద్రబాబు శిష్యుడైన రేవంత్‌రెడ్డి డబ్బులిచ్చేవాళ్లకే టికెట్లు ఇస్తున్నారని విజయ్‌కుమార్ మండిపడ్డారు. ఇటీవల అమెరికా వెళ్లిన రేవంత్‌రెడ్డి అక్కడ ఎన్నారైలతో కుమ్మక్కయ్యి అమెరికాలో ఉన్న తనవారికి టిక్కెట్లు ఇప్పించుకున్నాడని ఆరోపించారు. 'అమెరికాలో ఉన్నవారి పేరు మీద సర్వేలు ఎలా చేశారు? వాటికి పాజిటివ్ రిపోర్టులు ఎలా వచ్చాయి? స్థానికంగా ఉన్నవారికి ఎందుకు నెగెటివ్ రిపోర్టులు వచ్చాయి? ఈ దొంగ సర్వేలు చేయించడానికి సునీల్ కనుగోలుకు ఎన్ని కోట్లు ఇచ్చావ్?' అని రేవంత్‌రెడ్డిని సూటిగా ప్రశ్నించారు.

బీజేపీ జాబితా ఇప్పట్లో లేనట్టే

- ఢిల్లీలో జాబితా ప్రకటిస్తారని ప్రచారం
- ఢిల్లీ భేటీలో అభ్యర్థులపై చర్చించలేదు: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): ఢిల్లీలో గురువారం జరిగిన బీజేపీ పార్లమెంటరీ బోర్డు, ఎన్నికల నిర్వహణ కమిటీల సమావేశంలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికపై చర్చే జరగలేదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తేల్చేశారు. జాబితాను ఎప్పుడు విడుదల చేస్తారనే అంశంపై కూడా స్పష్టత ఇవ్వలేదు. ఢిల్లీ పెద్దలు అవకాశం ఇస్తే రేపో ఎల్లుండో మాట్లాడుతానని చెప్పారు. తెలంగాణలో ఎన్నికలకు ఇంకా 40 రోజుల సమయం ఉన్నదని, అందుకే ఇతర రాష్ట్రాల ఎన్నికలపైనే దృష్టిపెట్టినట్టు చెప్పారు. దీంతో జాబితా ఇప్పట్లో రానట్టేనని పరోక్షంగా చెప్పేశారు. జనసేనతో పొత్తుపైనా స్పష్టత ఇవ్వలేదు. దీంతో రాష్ట్రంలోని బీజేపీ నేతలు, కార్యకర్తలు పూర్తిగా డీలాపడిపోయారు. అభ్యర్థులు లేరని ఇతర పార్టీలు ఎద్దేవా చేస్తుండగా, పార్టీ పరిణామాలు కూడా దానికి తగ్గట్టే ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పొత్తుల కోసం ఎదురుచూడటాన్ని బట్టే అభ్యర్థులు లేరని అర్థం అవుతున్నదని వ్యాఖ్యానిస్తున్నారు.

చెప్పేందుకే సిద్ధాంతాలు.. ఆచరణకు కాదు

- బీజేపీలోనూ కుటుంబాలకు టికెట్లు!

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): తమది సిద్ధాంతాలతో నడిచే పార్టీ అని, తమ పార్టీలో సిద్ధాంతాలు తప్ప వ్యక్తులు ముఖ్యం కాదని చెప్పుకొనే బీజేపీ.. ఆచరణలో మాత్రం తాము ఇతర పార్టీలకు ఏమాత్రం ప్రత్యేకం కాదని స్పష్టమవుతున్నది. ఇప్పటికే ఆ పార్టీలో వ్యక్తిపూజ పరాకాష్ఠకు చేరుకోగా.. సిద్ధాంతాలకు నీళ్లొదలడం ఎప్పుడో మొదలైంది. ప్రస్తుతం ఆ పార్టీని శాసిస్తున్న నేతలు కేంద్రంలో అధికారంలోకి రావడానికి ముందు పార్టీలో 70 ఏండ్లు దాటిన వారికి బలవంతపు రిటైర్మెంట్ ప్రకటించి పదవులకు దూరం చేశారు. తాము మాత్రం 70 ఏండ్లు దాటినా పదవులను పట్టుకొని వేళ్లాడుతున్నారని ఆ పార్టీకి చెందినవారే విమర్శిస్తున్నారు. ఒకే కుటుంబం నుంచి రాజకీయాలలో ఉంటూ.. ప్రజా ప్రతినిధులుగా సేవలందించే వారిని కుటుంబ పాలన అంటూ విమర్శలు గుప్పించే బీజేపీ నేతలు ఇప్పుడు తాము కూడా ఇందుకు మినహాయింపు కాదని చాటుకుంటున్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దింపుతున్న అభ్యర్థుల్లో దంపతులకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలుస్తున్నది. మాజీ మంత్రి ఈటల రాజేందర్ హుజూరాబాద్ నుంచి పోటీ చేయాలని భావిస్తుండగా.. ఆయన భార్య జమున శేరిలింగంపల్లి లేదా మేడ్చల్ స్థానం నుంచి పోటీ చేయాలని భావిస్తున్నట్టు బీజేపీ శ్రేణులు చెప్పుకొంటున్నాయి. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి భార్య కావ్యారెడ్డి కూడా అసెంబ్లీ బరిలో దిగే ఆలోచనలో ఉన్నట్టు చెప్తున్నారు. మునుగోడులో సిట్టింగ్ స్థానానికి రాజీనామా చేసి, కమలాన్ని నమ్ముకుని పరాభవం పొందిన కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డికి ఎల్బీనగర్, ఆయన భార్య లక్ష్మికి మునుగోడు టికెట్లు కేటాయిస్తారని ప్రచారం జరుగుతున్నది. కరీంనగర్ నుంచి బండి సంజయ్, ఆర్మూర్ నుంచి ధర్మపురి అరవింద్ పోటీ చేయనున్నట్టు సమాచారం. మాజీ ఎంపీ విజయశాంతి ఏకంగా సీఎం కేసీఆర్‌పై పోటీచేయాలని ఆసక్తితో ఉన్నట్టు తెలిసింది.

ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

- ఎన్నికల కార్యకలాపాలపై నిఘా

హైదరాబాద్, అక్టోబరు 19 (నమస్తే తెలంగాణ): ఎన్నికల్లో పార్టీలు, అభ్యర్థుల కార్యకలాపాలపై ఎన్నికల సంఘం పటిష్టమైన నిఘా వ్యవస్థ ద్వారా పర్యవేక్షిస్తున్నది. ఎన్నికల ప్రచారం, ప్రసారం, నియమావళి ఉల్లంఘనలు, సోషల్ మీడియా తదితర వాటిపై నిఘా పెట్టడానికి ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. బీఆర్‌కేఆర్ భవన్‌లో ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూంను సిద్ధం చేసింది. దీని ద్వారా అభ్యర్థులు, రాజకీయ పార్టీల సభలు, సమావేశాలు, మీడియాలో ప్రసారమయ్యే కథనాలు, సమావేశాలు, సోషల్ మీడియా, చెక్‌పోస్టుల్లోని సీసీ కెమెరాలకు అనుసంధానం చేయడం, సీవిజిల్ యాప్, 1950 నెంబర్, సువిధ ఇలా అన్ని రకాల ఫిర్యాదుల వ్యవస్థను ఇక్కడి నుంచే పర్యవేక్షిస్తారు. వీటన్నంటిని సీఈవో వికాస్ రాజ్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. వీటిపై కేంద్ర ఎన్నికల సంఘానికి సమాచారం అందిస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్‌లో ఎలక్ట్రానిక్ మీడియా మానిటరింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. దీనిలో 16 తెలుగు న్యూస్ ఛానల్స్ లో ప్రసారమయ్యే వార్త కథనాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. సోషల్ మీడియా మానిటరింగ్ సెల్‌ను కూడా ఇక్కడే ఏర్పాటు చేశారు.

కాంగ్రెస్‌కు టాటా..బీఆర్ఎస్ బాట

మొదటిపేజీ తరువాయి...

పరిణమించింది. పార్టీలో ముందు నుంచి పనిచేస్తున్న నేతలెవరూ ఇప్పుడు సంతోషంగా లేరని సమాచారం. అనేకమంది అసంతృప్త నేతలు అధికార భారత రాష్ట్ర సమితిలో చేరుతున్నారు. దీంతో కాంగ్రెస్ నాయకత్వం దిక్కుతోచని స్థితిలో పడిపోయింది.

ప్రవాహంలా బీఆర్ఎస్‌లోకి నేతలు

కాంగ్రెస్‌లో అంతర్గత పోరు, వివక్ష నేపథ్యంలో ఆ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లోకి నేతల ప్రవాహం కొనసాగుతూనే ఉన్నది. కొన్నాళ్లుగా ప్రతీ రోజూ కాంగ్రెస్ రాష్ట్రస్థాయి నేతల నుంచి జిల్లా, మండలస్థాయి నేతలవరకు బీఆర్ఎస్‌లో చేరుతూనే ఉన్నారు. గడిచిన 15-20 రోజుల నుంచి చేరికలు మరింత పెరిగాయి. ఏకంగా మూడు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తమ అనుచరులతో సహా బీఆర్ఎస్‌లో చేరారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య సైతం బీఆర్ఎస్‌లో చేరారు. మరి కొద్ది రోజుల్లో కాంగ్రెస్, బీజేపీ నుంచి మరిన్ని చేరికలుండే అవకాశం ఉన్నది.

బీఆర్ఎస్‌లో చేరిన కీలక నేతలు

పొన్నాల లక్ష్మయ్య: పీసీసీ అధ్యక్షుడిగా, ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా, బీసీ నేతగా గుర్తింపు ఉన్న నాయకుడు. జనగామ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఉద్దేశపూర్వకంగా తనను అణచివేసే కుట్ర చేస్తున్నదని, రేవంత్‌రెడ్డి అక్కడి సీటును ఇతరులకు బేరానికి పెట్టాడని ఆరోపిస్తూ ఆయన బీఆర్ఎస్‌లో చేరారు.

కంఠారెడ్డి తిరుపతిరెడ్డి: మెదక్ డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న తిరుపతి రెడ్డి కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అపసవ్య పరిస్థితులను చూసి ఆ పార్టీ నుంచి బయటకొచ్చారు. మెదక్ నియోజకవర్గంపై ఏమాత్రం అవగాహన లేని వ్యక్తిని తీసుకొచ్చి టిక్కెట్టు ఇవ్వడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు.

నందికంటి శ్రీధర్: మేడ్చల్-మల్కాజ్‌గిరికి చెందిన నందికంటి శ్రీధర్ బీసీ బిడ్డ. ఐదేండ్లుగా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కోసం శ్రమపడ్డ ఆయనను కాదని మైనంపల్లి హన్మంతరావుకు టిక్కెటు ఇవ్వడంతో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న ఆయన పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. శ్రీధర్‌కు ఎంబీసీ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇచ్చి బీఆర్ఎస్ గౌరవించుకున్నది.

పటేల్ ప్రభాకర్‌రెడ్డి: గద్వాలకు చెందిన పటేల్ ప్రభాకర్‌రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న వ్యక్తి. ఆయన టిక్కెట్ ఆశించి భంగపడ్డారు. కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు.

పీ శశిధర్‌రెడ్డి: కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేత, మెదక్ మాజీ ఎమ్మెల్యే కూడా అయిన పట్లోళ్ల శశిధర్‌రెడ్డి ఇటీవలే బీఆర్ఎస్‌లో చేరారు.

గంట రాములు: పీసీసీ స్ట్రాటజీ కమిటీ సభ్యుడు, పెద్దపల్లి నియోజకవర్గం పరిధిలోని ఓదెల మండలం జడ్పీటీసీ సభ్యుడు గంట రాములు కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. నియోజకవర్గ స్థాయిలో బలమైన నేతగా ఈయనకు గుర్తింపు ఉన్నది.

కురువ విజయ కుమార్: పీసీసీ ప్రధాన కార్యదర్శి కురువ విజయ కుమార్ కాంగ్రెస్ పార్టీని వీడారు. పార్టీలో అడ్డగోలుగా టిక్కెట్లను అమ్ముకుంటున్నారని ఆరోపిస్తూ రాజీనామా చేశారు.

చింతపల్లి జగదీశ్వర్‌రావు: పీసీసీ సభ్యుడిగా ఉన్న చింతపల్లి జగదీశ్వరరావు, పార్టీ తీరుపై బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. ఆయన తన భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకునే పనిలో పడ్డారు. కాంగ్రెస్ పార్టీలో తనకు తీరని అన్యాయం జరిగిందని కార్యకర్తలతో సమావేశంపెట్టి మరీ వివరించారు.

రాగిడి లక్ష్మారెడ్డి: కాంగ్రెస్ సీనియర్ నేత. కమ్యూనిస్టు ఉద్యమాల నుంచి వచ్చిన నాయకుడు. ఉప్పల్ నియోజకవర్గంలో మంచి పేరున్నది. ఆయన కాంగ్రెస్ పార్టీని వీడుతున్నట్టు ప్రకటించాడు.

చెరుకు సుధాకర్: తెలంగాణ ఉద్యమ పోరాటంలో పీడీ యాక్టు కింద అరెస్టయిన తొలి వ్యక్తి. బీసీ నేత. కాంగ్రెస్ పార్టీలో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం, కొందరు ఉద్దేశపూర్వకంగా పార్టీ అధిష్ఠానాన్ని తప్పుదోవపట్టించడంపై ఆవేదనతో ఉన్నారు. ఆయన కూడా కాంగ్రెస్‌ను వీడారు.

జిట్టా బాలకృష్ణారెడ్డి: భువనగిరికి చెందిన తెలంగాణ ఉద్యమ నాయకుడు, యువజన సంఘాల నేత జిట్టా బాలకృష్ణారెడ్డి భువనగిరి టిక్కెట్టు ఆశించి కాంగ్రెస్‌లోకి వెళ్లారు. చివరి నిమిషంలో కాంగ్రెస్ పార్టీ ఆయనను మోసం చేయడంతో పార్టీని వీడుతున్నారు. శుక్రవారం మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరనున్నారు.

సోమశేఖర్ రెడ్డి: ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన సోమశేఖర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చురుకైన నేత. కార్పొరేటర్ కూడా. పార్టీ తీరు నచ్చక ఆయన బయటకు వచ్చారు.

నాగం జనార్ధన్‌రెడ్డి: మాజీ మంత్రి నాగం జానర్ధన్ తెలంగాణ ఉద్యమంలో కూడా పాల్గొన్న వ్యక్తి. సీనియర్ నేత. ఈయనకు నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే సీటు రాకుండా చేసేందుకు వ్యూహం పన్నారు. కాంగ్రెస్ తీరుపై విసిగిపోయిన ఆయన పార్టీకి దూరమయ్యారు.

కొత్త మనోహర్‌రెడ్డి: మహేశ్వరానికి చెందిన కొత్త మనోహర్‌రెడ్డి అసెంబ్లీ టిక్కెట్లు అమ్ముకోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. పార్టీ తీరుపై బహిరంగంగా ఆరోపణలు చేశారు. పీసీసీ అధ్యక్షుడు టిక్కెట్లు అమ్ముకుంటున్నాడని ఆరోపించారు.

243 కోట్ల సొత్తు స్వాధీనం

ఒక్కరోజులోనే 78 కోట్ల విలువైన బంగారం, నగదు, మద్యం సీజ్

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): ఎన్నికల నేపథ్యంలో తనిఖీ బృందాలు చురుగ్గా పనిచేస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా నిర్వహిస్తున్న తనిఖీల్లో కేవలం 11 రోజుల్లోనే రూ.243,76,19,296 విలువైన మద్యం, బంగారం, నగదును స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఒక్కరోజే రికార్డుస్థాయిలో రూ.78 కోట్ల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేశారు. గురువారం రూ.10.13 కోట్ల నగదు దొరకగా, 19వ తేదీ వరకు రూ.88 కోట్ల నగదు పట్టుబడింది. 19న రూ.1.21 కోట్ల విలువైన మద్యాన్ని అక్రమ రవాణా కాకుండా అడ్డుకున్నారు. ఇప్పటి వరకు రూ.120.40కోట్ల ఆభరణాలు, వజ్రాలు పట్టుబడ్డాయి. ఇక ఎన్నికల వేళ ఓటర్లకు పంచే లైస్‌కుక్కర్లు, ల్యాప్‌టాప్‌లు, చీరలు, క్రీడా సామగ్రి, బియ్యం వంటి రూ.17,48,81,471 విలువైన వస్తు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

జిల్లాల పర్యటనకు వికాస్‌రాజ్

హైదరాబాద్, అక్టోబరు 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లాల్లో పర్యటించనున్నారు. ఎన్నికల నామినేషన్‌లు ప్రారంభమయ్యే అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో పర్యటించాలని నిర్ణయించారు. ఇప్పటికే మహబూబ్‌నగర్ జిల్లా పర్యటన పూర్తి కాగా శుక్రవారం ఆదిలాబాద్, ఆ తరువాత కరీంనగర్ జిల్లాలో పర్యటించనున్నారు. దసరా తరువాత మిగిలిన జిల్లాలను సందర్శిస్తారని సమాచారం. ఈవీఎంలు, ఎన్నికల నియామవళి అమలు, పోలింగ్ స్టేషన్‌లు, శాంతి భద్రతలు, తనిఖీలు, కౌంటింగ్ ఏర్పాట్లు తదితర వాటిపై కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో సమీక్షిస్తారు.

దుబ్బాక నియోజకవర్గం రాయపోల్ మండలం రాంసాగర్‌లో చీరలు పంచినంత మాత్రాన ఓట్లు వేస్తామా అంటూ రఘునందన్‌ను ప్రశ్నిస్తున్న మహిళ

రఘునందన్.. మా ఊరికెందుకొచ్చావ్?

- ఉప ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై మహిళల నిలదీత
- ప్రజల తిరుగుబాటుతో అర్ధాంతరంగా ముగిసిన ప్రచారం

దుబ్బాక, అక్టోబర్19: దుబ్బాక బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు ప్రజల నుంచి చుక్కెదురైంది. దుబ్బాక ఉప ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చకుండా.. మళ్లీ మా గ్రామాలకు ఎందుకొచ్చావని నిలదీశారు. దుబ్బాక నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా రఘునందన్‌రావు నిర్వహిస్తున్న ప్రచారంలో భాగంగా.. గురువారం రాయపోల్ మండలం వీరానగర్, రాంసాగర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు, మహిళలు ఆయనను అడ్డుకున్నారు. నిరుద్యోగ యువతకు భృతి, రైతులకు జోడెడ్లు, నాగలి, నిరుపేద వధువు వివాహానికి ఆర్థిక సహాయం, కేంద్ర ప్రభుత్వం నుంచి దుబ్బాకలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశం కల్పిస్తానంటూ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నల వర్షం కురిపించారు. ఉప ఎన్నికల్లో నోటికొచ్చిన హామీలిచ్చి ఓట్లు వేయించుకుని తమను మోసం చేశావంటూ గ్రామస్థులు ఆగ్రహించారు. తమ గ్రామంలో బీజేపీ ప్రచారం నిర్వహించవద్దని అడ్డుకున్నారు. చేసేదేమిలేక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ప్రచారాన్ని అర్ధాంతరంగా ముగించుకుని వెళ్ల